**శంభో మహాదేవ**

# నవగ్రహ అనుకూల, ప్రతికూల ఫలితాలు

## రవి

**రవి అనుకూలంగా ఉంటే ఇచ్చే ఫలితాలు :-** క్రమశిక్షణకు, టైం పంక్చువాలిటీకి, ఆరోగ్యానికి ఎక్కువ ప్రాముఖ్యతనిస్తారు. జీవితంలో ఉన్నత స్థితి సాధించినా ఇంకా ఏదో సాధించాలన్న పట్టుదలతో ఉంటారు. నిజాయితీ, కీర్తి ప్రతిష్ఠలు, వ్యక్తిగత గౌరవానికి అధిక ప్రాముఖ్యతనిస్తారు. త్వరత్వరగా మాట్లాడటం, ముక్కుసూటిగా నడచుకోవటం వీరి లక్షణాలు. సమయం వచ్చినప్పుడు ఎంత బ్రతిమలాడినా, బంధువులకు, ఇంట్లో వారికి కూడా సహాయం చేయరు. నిజాయితీ, ధర్మం, న్యాయం అంటూ అందరినీ దూరంగా ఉంచుతారు. ఎలాంటి ప్రోత్సాహం లేకుండా ఇతరులు కూడా తనలాగా అభివృద్ధి చెందాలని ఉపన్యాసాలిస్తారు. నేను లేనిదే ప్రపంచమే లేదని తేల్చి చెబుతారు. ప్రపంచం అంతా తనమీదే నడుస్తున్నట్లు భావిస్తారు. అదే విషయం చెబుతారు. కళ్లకు సంబంధించి, కిడ్నీలకు సంబంధించిన ఇబ్బందులు ఏర్పడతాయి. మాట పట్టింపు కోసం అత్యున్నత స్థానంలో ఉన్న వ్యక్తులను కూడా దూరం చేసుకుంటారు. మొండిగా ప్రవర్తిస్తారు. నమ్మక ద్రోహులను నమ్ముతారు. నిజాయితీయే ప్రాణంగా జీవిస్తారు.

**రవి అనుకూలంగా లేకపోతే ఇచ్చే ఫలితాలు :-** జీవితంలో ప్రతిసారి ఉన్నత అధికార అవకాశాలు చేజారిపోతాయి. ప్రభుత్వ, రాజకీయ వ్యవహారాల్లో అందరికీ సులభంగా అయ్యే పని కష్టతరం అవుతుంది. అధికారం లేని బాధ్యతలు, తండ్రి వల్ల నష్టపోవుట శిరోవేదన లేక పార్శ్వపు నొప్పి, జ్యేష్ఠ సంతానం గురించి దిగులు, భూముల్ని, ఆస్తుల్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవటం, పన్నులు వసూలు చేసే అధికారుల వల్ల నష్టపోవుట, నమ్మిన రాజకీయ నాయకులు కృతజ్ఞత లేని వారవుట, రాజకీయాల్లో నష్టపోవుట,షేర్ల బిజినెస్‌లో నష్టం. వైద్య విద్యార్థులకు ఆటంకాలు, శక్తి సామర్థ్యాలు ఉన్నా డాక్టరుగా రాణించలేకపోవటం, సామాజిక మార్పును కోరుకునే తత్త్వం, నాస్తికత్వం, ప్రభుత్వ వ్యతిరేకత, విప్లవ గేయాలు, మందుల వ్యాపారం, అల్ప సంతోషం వంటి లక్షణాలు ఏర్పడతాయి. ముఖ్యమైనటువంటి సంఘటనలు నవంబరు, మే నెలలో జరుగుతాయి. వివిధ రకాల వైద్య చిట్కాల గురించి, దేశ విదేశాల్లోని వైద్య పద్ధతుల గురించి, వ్యాయామం, యోగాసనాల గురించి చెప్పే విషయాలు చాలా విసుగు పుట్టిస్తాయి. సామర్థ్యం ఉండి కూడా అవకాశం రాక మానసికంగా ఒక విధమైన లోకంలో (ట్రాన్స్‌లో) ఉంటారు.

## చంద్రుడు

**చంద్రగ్రహం అనుకూలంగా ఉంటే ఇచ్చే ఫలితాలు :-** వీరు అందరిలో కలిసిపోతారు. నవ్వుతూ మాట్లాడటం, ఎదుటి వారి వివరాలు, రహస్యాలు తెలుసుకోవటం, వాటిని ఇంకొకరికి చెప్పి తగాదాలు పెట్టించడంలో సిద్ధహస్తులు. ఆడవాళ్లతో కలిసి చక్కగా ముచ్చటించడం, వంటలు, అలంకారాల గురించి, స్త్రీల గురించి మంచి అవగాహన ఉంటుంది. స్త్రీలను ఆకర్షించడానికి రకరకాల విషయాలు బోధిస్తారు. తాను చేసే పనిని అందరూ మెచ్చుకోవాలని కోరుకుంటారు. క్రీడల్లో నైపుణ్యం, క్రీడా సంఘాలను నడుపుట, ప్రతి విషయంలో జోక్యం చేసుకుంటారు. సమాజ సేవ ముసుగులో స్వార్థ ప్రయోజనాలు నెరవేర్చుకుంటారు. ఎవరినీ లెక్కచేయని నమ్మని వ్యక్తుల్ని నమ్మించడంలో, అబద్ధాలు, పుకార్లు సృష్టించడంలో వీళ్లకు వీళ్లే సాటి. ఎక్కువ ఓర్పు కలిగి ఉంటారు. అన్నింటికన్నా పరిశుభ్రంగా ఉండటానికి ప్రాధాన్యతనిస్తారు. ఈత కొట్టడం, సమయానికి స్నానం చేయటం, చల్లని పదార్థాలు, పానీయాలు సేవించడం వీరి అలవాట్లు. తల్లి పెంపకం, తల్లి పోలికలు ఎక్కువగా ప్రభావం చూపిస్తాయి. దగ్గర వాళ్లతో ఘర్షణ పడటం, చట్టం అన్నా, పోలీసులు అన్నా వీరికి భయం. ఎడమ చేతి వాటం ఉంటుంది.

**చంద్రగ్రహం అనుకూలంగా లేకపోతే ఇచ్చే ఫలితాలు :-** వీరి నవ్వు ఎదుటి వారికి కలవరం కలుగ చేస్తుంది. స్నానం చేయకుండా చాలా రోజులు ఉండగలరు. క్రీడా సామర్థ్యం ఉంటుంది. కానీ అదృష్టం కలిసి రాదు. క్రీడాజీవితం గురించి, వీళ్ల పాత జీవితంలో సాహసాల గురించి పదేపదే చెప్పి ఎదుటి వాళ్ళను విసిగిస్తారు. ముఖ్యమైన సమయంలో మానసిక ఒత్తిడికి లోనై ప్రతిభను చూపించలేరు. అప్పులు పెట్టి నష్టపోవటం, నీటి ప్రయాణాలు అంటే విపరీతమైన భయం, దొంగల భయం, దయ్యాల భ్రాంతి, విపరీత, విచిత్ర ప్రవర్తన ఉంటుంది. నిష్కారణంగా ఏడవటం వీరి లక్షణం. బంధువులు, స్వకులస్తులు చాలా విషయాల్లో ద్రోహం చేస్తారు. శిష్య వర్గం ఉన్నత స్థానంలో ఉండి ధనార్జన చేస్తారు. వీళ్లు ప్రారంభించిన ప్రతి పని విజయవంతమే అవుతుంది. అయితే వీళ్లకు గౌరవం గానీ, ధనం గానీ, గుర్తింపు గానీ దక్కదు.

## కుజుడు

**కుజ గ్రహం అనుకూలంగా ఉంటే ఇచ్చే ఫలితాలు :-** వీళ్లు పరిచయాలు ఉపయోగించుకొని అవసరం తీరాక మర్చిపోయినట్లు గొప్పగా నటిస్తారు. వీళ్లు క్రీడాభిమానులు, సాహస క్రీడలంటే మరింత అభిమానం. క్రీడా సంబంధ విషయాల్లో లాభపడతారు. గజం స్థలం రూపాయికి కొని లక్ష రూపాయలకు అమ్ముతారు. కాలం కలిసి వస్తుంది. భూమి సంబంధమైన విషయాలు విశేషంగా లాభిస్తాయి. ఇతరులను చేరదీస్తారు. రాష్ డ్రైవింగ్, చేయి చేసుకోవడం, తన్నులు తినడం వీళ్లకి షరా మామూలే ! సంఘ విద్రోహ శక్తులకు నాయకత్వం వహిస్తారు. అధికారం

పలుకుబడి సాధిస్తారు. బోగస్ సంస్థలు స్థాపించుట, దివాళా తీయించుటలో సిద్ధహస్తులు. సామూహికంగా ప్రజల్ని మోసం చేస్తారు. మానసిక ధైర్యం, సాహసమైన నిర్ణయాలు వీళ్లకున్న లక్షణాలలో ముఖ్యమైనవి. శారీరక బలం సాధారణం. సెటిల్‌మెంట్లు చేసి కోట్లు సంపాదిస్తారు.

**కుజగ్రహం అనుకూలంగా లేకపోతే ఇచ్చే ఫలితాలు :** - వీరిది రెండు రకాల జీవితం. అందరికీ తెలిసినది వేరు. గోప్యంగా ఉన్న గతం వేరు. బాల్యంలో కష్టపడి, యౌవ్వనంలో కొందరితో విడిపోయి మరో ప్రాంతానికి వచ్చి నూతన జీవితం గౌరవప్రదంగా గడుపుతారు. కుటుంబ బాధ్యతలు మోస్తారు. వీరిది స్నేహితులను ఆదుకునే మనస్తత్వం. వెంటనే జాలిపడి ఏదో మేలు చేస్తారు. భార్యవైపు బంధువులు పెత్తనం చెలాయిస్తారు. అందరూ వీరి ఆస్తి కోసం కనిపెట్టుకొని కూర్చుంటారు. వ్యవసాయం, యంత్రవాహనాలు, న్యాయవాద వృత్తి వ్యవహారాలు కలిసివస్తాయి. అందరూ ఉండి కూడా జీవితంలో వీరు ఏకాకులౌతారు. దైవభక్తి సాధారణం. అనవసరమైన బాధ్యతలు నెత్తిన వేసుకోవటం, పనికి రాని వాళ్లని అందలం ఎక్కించటం లాంటి పనులు చేస్తారు. కష్టపడి సంపాదించి తాను సుఖపడకుండా దాచిపెడతారు. మంచి వాళ్లను నమ్మి చేరదీయరు. డబ్బు ఖర్చులేని క్రీడలు ఆడతారు. స్త్రీల పట్ల ద్వేషం కలిగి ఉంటారు. ఇతరులకు చేసిన మేలుని అందరికీ చెప్పి వాళ్ల పరువు తీస్తారు. దాంతో సహాయం పొందిన వాళ్లు కూడా వీళ్లని అభిమానించలేరు. ఆరోగ్యం విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటారు. వంటల విషయంలో సలహాలు ఇవ్వటం, భోజన పదార్థాల రుచుల గురించి వర్ణన, రేపు తినబోయే కూర గురించి ముందుగా చర్చలు, తిండికోసమే జీవితం అన్నట్లు ప్రవర్తిస్తారు. చిన్న గుడ్డ ధరించి నలుగురిలో ధైర్యంగా తిరుగుతారు. పోట్లాటలకు ముందుంటారు. కొట్టుకునే సమయంలో కనిపించరు. ( సంపూర్ణమైన వివరాలు “అంగారకుడు” పుస్తకంలో చూడండి.

## బుధుడు

**బుధ గ్రహం అనుకూలంగా ఉంటే ఇచ్చే ఫలితాలు :** - వీరు ఇతరుల మేధస్సును, ఆలోచనలను, నైపుణ్యాలను తస్కరించి సొమ్ము చేసుకోవటంలో సిద్ధహస్తులు. గణితంలో మంచి పరిజ్ఞానం మంచి జ్ఞాపకశక్తి, తిండి పుష్టి ఉంటుంది. సమస్యలను వీళ్లే సృష్టించి, వాటిని పరిష్కరించి, మధ్యవర్తిత్వం పేరుతో డబ్బులు దండుకుంటారు. సమస్య పరిష్కరించారని ఇతరులు భావిస్తారు గానీ, సమస్య సృష్టించింది వీళ్లే అని వాళ్లు ఎప్పటికీ తెలుసుకోలేరు. వైట్‌కాలర్ నేరాలు, నకిలీ వస్తువుల సృష్టిలో వీళ్లు నేర్పరులు. సమాజ సేవలో ఉంటారు. వీళ్ల మనస్తత్వం తెలియవచ్చుకానీ, నేరం ఋజువు కాదు. ప్రభుత్వసంబంధమైన స్కీంలు, ఋణాలు తీసుకోవడం, ఎగ్గొట్టడం, కాగితాలపై భవంతులు చూపించి వంతెనలు కట్టినట్లు నకిలీ

కాగితాలు చూపి బిల్లులు వసూలు చేసుకుంటారు. రూపాయి పనికి కనీసం వెయ్యి రూపాయల లాభం పొందుతారు. చట్టం, ప్రభుత్వవ్యవస్థలోని లోపాల్ని వీరు చక్కగా ఉపయోగించుకుంటారు. బంగారం, వెండి దాస్తారు. డబ్బు ద్వారా డబ్బుని రెట్టింపు చేస్తారు. ధనం ఎందులో పెట్టుబడి పెట్టాలో వీరికి బాగా తెలుసు. వృత్తి రహస్యాలు చౌకగా కొని, లాభానికి అమ్ముతారు. ఏజన్సీలు, కోటాలు ఇతరుల పేరు మీద మంజూరు చేయించి తమ స్వాధీనం చేసుకోవటం వంటివి గొప్పగా చేయగలరు. లాభం వచ్చే వ్యాపారాలు సొంతంగానూ, నష్టం వస్తుందని భావించిన వ్యాపారాలు ఇతరులతో పెట్టుబడి పెట్టి చేయిస్తారు. దత్తత, ఆస్తి కలిసి రావటం, ఇల్లరికం వెళ్లి అక్కడి వాళ్లకి క్షౌర కళ్యాణం చేసి బాగుపడటం, బంధువులకు, ఆస్తి పంపకాల్లో ముప్పు తిప్పలు పెట్టి, ఆస్తి వదిలేసి పారిపోయేలా చేస్తారు. బల ప్రయోగం, కొట్లాటలు వీరి లక్షణాలు కావు. చర్మసంబంధమైన వ్యాధులు ఇబ్బంది పెడతాయి. భార్య పట్ల భయం, భక్తి ఉంటాయి. స్నేహితులను విడదీయటం, ఐకమత్యంగా ఉండే సంస్థల్లో గ్రూపు తగాదాలు తేవటం వీరి ప్రత్యేక లక్షణం.

**బుధ గ్రహం అనుకూలంగా లేకపోతే ఇచ్చే ఫలితాలు :-** వీళ్లు ప్రతి విషయంలోనూ ఎవరో ఒకరి మీద ఆధారపడతారు. ఒంటరిగా సినిమాకి కూడా వెళ్లరు. పెద్దగా పరిజ్ఞానం లేకపోయినా మంచి వేషధారణ, మేధావి, అధికారిగా కనిపించే ప్రయత్నం చేస్తారు. రెండు భాషలు మాట్లాడటం, రాని భాషను వచ్చినట్లుగా నటించడం వీళ్ల లక్షణం. చిరుతిళ్లు తినడం, సాహసకృత్యాల గురించి ఉపన్యాసాలు, దేశ సేవ చేయటం గురించి ఉపన్యాసాలు, వాళ్ల పూర్వీకుల గొప్పతనాలకి సంబంధించిన గాథలు చెప్పి విసుగు పుట్టించడం వీళ్ల లక్షణం. ప్రతి విషయం మీద ఎవరో ఒకరికి ఉత్తరాలు వ్రాయటం, ఎవరికైనా సాధారణంగా ఉత్తరం చేరిందని సమాధానం ఇస్తే చాలు, ఆ ఉత్తరం జిరాక్స్ కాపీలు తీయించి ప్రధానమంత్రితో ఇప్పుడే ఫోన్‌లో మాట్లాడాను, నాకు బాగా సన్నిహితుడు, అందుకే లెటర్ వ్రాశాడు చూడండి అని చూపించడం. ఆ ఉత్తరంలో ఏమీ ఉండదు. "మీరు వ్రాసిన ఉత్తరం చేరింది అని తప్ప" అందరూ పరిచయం ఉన్నట్లు ఏకవచన సంభాషణ. ధనవంతులంతా వీళ్ల నాన్న సాయం చేసినవాళ్లే అంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే బిల్‌గేట్స్‌కి కంప్యూటర్ నేర్పింది, సచిన్‌కి బ్యాటింగ్ నేర్పింది నేనే అన్నట్లుగా మాట్లాడతారు. ఎదుటివారు నవ్వుకుంటారన్న సంకోచం గానీ, అబద్ధాలు అని తెలుసుకుంటారనే ఆలోచన గానీ వీళ్లకి ఏ మాత్రం ఉండదు. అందరూ ఓ సినిమా బాగుందంటే, పరమ చెత్తగా ఉందని వాదిస్తారు. దేశానికి స్వాతంత్ర్యం రాకుండా ఉంటే బాగా అభివృద్ధి చెంది ఉండేదని వీళ్ల వాదన. ఇలా విచిత్రమైన ధోరణిలో వాళ్ల భావాలు ఉంటాయి. ఆ పూటకి సంపాదించుకొని తినటం తప్ప జీవితం పట్ల భయం, ఆశయాలు ఉండవు. ప్రత్యేకించి హాస్యాస్పదంగా వీళ్ళ జీవితం ఉంటుంది. వీళ్ల వల్ల ప్రమాదం లేదు. డబ్బులు అప్పుగా ఇవ్వరు. సమయం వృథా చేసే తలనొప్పి మనుషులుగా చెప్పవచ్చు.

## గురుడు

**గురు గ్రహం అనుకూలంగా ఉంటే ఇచ్చే ఫలితాలు :-** ఉన్నత విద్య, నియమబద్ధమైన జీవితం, పరిజ్ఞానం వంటి మంచి లక్షణాలు ఉంటాయి. ఉన్నంతలో ఇతరులకు సహాయం చేయటం, అతిగా జోక్యం చేసుకోకుండా సలహాలు ఇచ్చి నిర్ణయాలు తీసుకునే బాధ్యత ఇతరులకే వదిలేస్తారు. అధికారం కలిగిన ఉద్యోగం ఉంటుంది. వివాదాస్పద అంశాల జోలికి వెళ్లరు. తెలిసీతెలియక కుటుంబ సభ్యులు, సంతానం కష్టాల్లో ఇరుక్కున్నా సహాయపడరు, సహకరించరు. తన మాట కాదన్న వాళ్లను జీవిత పర్యంతం శత్రువులుగానే చూస్తారు. ఏదో ఒక శాస్త్రంలో, వృత్తిలో నిపుణత ఉంటుంది. ధనం దానికదే వస్తుంది. వీళ్ల ప్రయత్నం నామమాత్రం. వీళ్ల క్రమశిక్షణా పద్ధతులు జీవన విధానంలో ఆచరించాలంటే కలియుగంలో సాధ్యపడదు. త్రేతాయుగం నాటి భావాలు, క్రమశిక్షణ వీళ్లు పాటించగలరు. సాంప్రదాయ విరుద్ధమైన పనులు చేయరు. అలాంటివి అసలు వినరు. దేశభక్తి, దైవభక్తి, వృత్తి ఉద్యోగాల పట్ల అంకిత భావం ఉంటుంది. ఇన్ని మంచి లక్షణాలు ఉన్నా కుటుంబపరంగా మనశ్శాంతి ఉండదు. భార్యతో విభేదాలు, సంతానంతో తెగదెంపులు సంభవిస్తాయి. కుటుంబ సభ్యులు వీళ్ల పరువు ప్రతిష్ఠలకు మచ్చ తెస్తారు. ఇతరుల ముందు తగాదాలు, నోరు చేసుకోవడం, సినిమాలు, క్లబ్బులు, షికార్లు ఇలా పొంతన లేని పనులు చేసి పరువు తీస్తారు. సంతానం "పండిత పుత్రః పరమ సుంఠః" అన్న సామెతని ఋజువు చేస్తారు. చిల్లర దొంగతనాలు, వర్ణాంతర వివాహం, దురలవాట్లు, ఇంట్లో నుండి వెళ్ళి కూలి పనులు వంటివి చేస్తారు. మనశ్శాంతి, పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగిస్తారు. బంధువులు సూటీపోటీ మాటలు మాట్లాడతారు. ధనం గుంజే ప్రయత్నాలు చేస్తారు. ఎదురుగుండా వినయ, విధేయతలు నటించి వాళ్ళ ప్రయోజనాలు చక్కబెట్టుకుంటారు. సోదరి వర్గానికి వీరు చేసే సాయం, ధర్మ బుద్ధి, నైతిక బాధ్యతలు పూర్తి వ్యతిరేక ఫలితాలనిస్తాయి. వీళ్లు గొప్ప చరిత్రకారులుగా ప్రసిద్ధి కెక్కుతారు. న్యాయ నిర్ణయం చేయటంలో సొంత వాళ్లను, పరాయి వాళ్లకు బేధం లేకుండా సమదృష్టితో చూస్తారు. "మనస్సు మాటల్లోనే తెలుస్తుంది." అనే సత్యాన్ని వీరు గ్రహించలేక అందరికీ శత్రువులు అవుతారు. లౌక్యం ప్రదర్శించరు. అంతరాత్మ సాక్షిగా తాను నమ్మిన ధర్మాన్ని అమలు చేస్తారు.

**గురు గ్రహం అనుకూలంగా లేకపోతే ఇచ్చే ఫలితాలు :-** వీరి లక్షణాలు ఆకర్షణీయంగా ఉంటాయి. ఆచరణలో ఇతరులకు నష్టం కలుగుతుంది. ఉన్నత స్థానంలో ఉన్న చాలా తక్కువ స్థాయి పనులు చేస్తారు. కక్కుర్తి మనుషులుగా ముద్ర పడతారు. కోట్ల రూపాయల ఆస్తి ఉన్నా వంద రూపాయల దగ్గర అబద్ధం ఆడతారు. చిన్న విషయానికి కూడా అఖండమైన ప్రచారం వస్తేనే ఆ దానం చేస్తారు. వేషధారణ సనాతన సంప్రదాయాలు ఉట్టిపడే విధంగా ఉంటుంది. వీళ్ల ముఖాన్ని చూసి మనస్తత్వాన్ని అంచనా వేయటంలో చాలా మంది పొరపాటు పడతారు.

ఎదుటివారికి పని చెప్పటం, వాళ్లు సరిగ్గా చేస్తున్నారా? లేదా? అని వేరే వాళ్లను నిఘా ఉంచటం వీరి లక్షణం. వీళ్లని నమ్మి రహస్యాలు చెబితే పేపర్‌లో వేసినట్లే. ఉన్నతాధికారం చేతిలో ఉన్నా చిన్న ఉద్యోగులను వేధించడం, తన గొప్పతనం గురించి పదేపదే ఉపన్యాసాలు ఇవ్వటం వీరి లక్షణం. దుష్ప్రచారం అంటే వీరికి భయం. మీడియాకి దూరంగా ఉంటారు. ధన సంపాదనే జీవిత లక్ష్యంగా శ్రమిస్తారు. అందుకు ఎన్ని పెడమార్గాలు ఉంటే అన్నింటినీ ప్రయత్నిస్తారు. కనికరం అనేది ఉండదు. సుదీర్ఘ పరిచయంలోనైనా వీళ్ళతో ఒక్కపని చేయించుకోవటం, మేలు పొందటం జరుగదు. డబ్బులు ఇస్తే ఏ పరిచయం అక్కరలేదు. స్నేహం, పరిచయం కన్నా డబ్బే ముఖ్యం. వీళ్లకి ఆరోగ్యం బాగుంటుంది. రక్తపోటు, షుగర్ వంటివి బాధిస్తాయి. కొడుకుల్ని అతిగారాబం చేసి, భార్యని, కూతుళ్లని, బంధువుల్ని ఇబ్బంది పెడతారు. "ఐ.ఏ.యస్. ప్రిపేర్ అవ్వడానికి మా అబ్బాయి బెంగుళూరు వెళ్ళాడు" అని చెబుతారు. నిజానికి వాళ్ల అబ్బాయి అక్కడ గుఱ్ఱపు పందాలు ఆడతాడు. వీళ్లు సమాజాన్ని మోసం చేసే ప్రక్రియలో వాళ్లు మోసపోతారు. వీళ్ళ దగ్గర అప్పు చేసినంత పొరపాటు ఇంకొకటి లేదు. వీళ్ల తెలివి తేటలు విశాల హృదయంతో సమాజం కోసం వెచ్చిస్తే సంస్థలు, కుటుంబాలు వేలాది మంది బాగుపడతారు. "తనకు దక్కనిది ఇతరులకు కూడా దక్క కూడదు." అన్నది వీళ్ల అభిప్రాయం. స్నేహితుల్ని ఓడించడానికి శత్రువులతో చేయి కలుపుతారు. వయస్సు పెరిగినకొద్దీ ఈ లక్షణాలు పెరుగుతాయి కానీ తగ్గవు. భార్యతో కొన్నాళ్ళు వియోగం ఉంటుంది. దేవుడి పేరు చెప్పి చందాలు వసూలు చేయటం, ఆధ్యాత్మిక రంగాల్ని వ్యాపారమయం చేయటంలో వీళ్లకి సాటి వచ్చే వాళ్లు లేరు. వీళ్లకున్న వాక్ చాతుర్యం అద్భుతం. తెలియని విషయాలను కూడా పరిశోధన చేసినట్లు చెబుతారు. మధ్యవర్తిత్వంలో మోసాలు, దొంగ తీర్పులు, సాక్ష్యాలు, కమీషన్లు కాజేయటం, పిటిషన్లు పెట్టడం వీళ్ళ జీవితంలో సాధారణమైన అంశాలు. "కన్న తల్లికి కూడు పెడితే గొప్ప" అది ఒక్కటి చేస్తారు. విజ్ఞాన, వివేకాలు అన్నీ ఉండి ధనం మత్తులో అన్ని నైతిక విలువలకూ తిలోదకాలిస్తారు. జీవిత చరమాంకంలో వీరిలో మార్పు వస్తుంది. మితిమీరిన పుత్రప్రేమ అనేక సమస్యలకు కారణం అవుతుంది.

## శుక్రుడు

**శుక్ర గ్రహం అనుకూలంగా ఉంటే ఇచ్చే ఫలితాలు :-** వీరు విలాసవంతమైన జీవితం గడిపే ధనవంతులు, మేధావులు. కళా, సాంస్కృతిక రంగాలను, రాజకీయాలను శాసిస్తారు. అత్యున్నత స్థానాల్లో ఉన్నవారు వీరికి సన్నిహితంగా ఉంటారు. కళారంగంలో రాణింపు, రాజకీయ పదవీయోగం సంప్రాప్తిస్తుంది. తెరవెనుక నుండి సలహాలు చెబుతూ మేధావులుగా సామర్థ్యాన్ని ఋజువు చేసుకుంటారు. చాలా విషయాలు బయట ప్రపంచానికి తెలియకుండా జాగ్రత్త పడతారు. వీరి మానసిక వేగం, పరిపక్వత, సమయోచిత నిర్ణయాలు ఆశ్చర్యం కలిగిస్తాయి.

జీవితంలో తక్కువ స్థాయి నుండి ఉన్నత స్థాయికి ఎదుగుతారు. అన్ని వ్యసనాల్లో ప్రవేశం ఉంటుంది. వ్యసనాల్లో బానిసత్వం ఉండదు. చిన్న కళాకారుడిగా జీవితం ప్రారంభించి, కళారంగాన్నే శాసించే స్థాయికి ఎదుగుతారు. బంగారం, విచిత్ర వస్తువులు, ఆధునిక వస్తువుల సేకరణలో వీరే ముందుంటారు. వీళ్లను చెప్పుచేతుల్లో ఉంచుకోవటం భార్య, పిల్లలకు సైతం సాధ్యం కాదు. సెంటిమెంట్స్, పెళ్లిళ్లకు హాజరు కావటం ఇటువంటివి పట్టించుకోరు. స్త్రీ సంతానం పట్ల విశేషమైన ప్రేమ కలిగి ఉంటారు. పని, దాని ద్వారా ప్రయోజనం అందుకే కృషి చేస్తారు. కాలంతోపాటు పరుగెత్తుతారు. స్వార్థం అధికం. మాట సాయం వరకే వీరి సహాయం పరిమితం అవుతుంది. పంచాయితీ సర్పంచ్‌గా ప్రారంభమైన వీళ్ల రాజకీయ జీవితం కేంద్రమంత్రి స్థాయి వరకు పెరుగుతుంది. బంధుమిత్రులతో సంబంధాలు అంతంతమాత్రం. ఒకరికి లొంగి ఉండరు. అతి స్నేహాలు ఉండవు. హవాలా, స్మగ్లింగ్ మొదలైన జాతీయ, అంతర్జాతీయ వ్యవహారాల్లో సంబంధాలు కలిగి ఉంటారు. తన చేతికి మట్టి అంటకుండా కార్యనిర్వహణ చేస్తారు. ఆర్థిక మోసాలు, సలహాలు, విదేశీ వ్యవహారాలు, మధ్యవర్తిత్వం షేర్ బిజినెస్ వంటివి, పరపతితో జరిగే కార్యక్రమాలు ఘనంగా నడిపిస్తారు. నమ్మకస్తులైన అనుచరవర్గం ఉంటుంది. ప్రతి పనిలోనూ చట్టానికీ, ప్రజలకూ దొరక్కుండా జాగ్రత్తలు వహిస్తారు. వీళ్లు ఆధ్యాత్మికరంగంలో ఉంటే విలాసవంతమైన పోకడలు జోడిస్తారు. ఒకే మాటను, ఒకే సిద్ధాంతాన్ని తనకు ఒక రకంగా, మరొకరికి ఇంకోరకంగా మలచటంలో నేర్పరులు. కూతురంటే బాగా చూసుకుంటారు. ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తారు. వృత్తి, ఉద్యోగ,వ్యాపారాల్లో పొరపాటు జరగనివ్వరు. కింగ్‌మేకర్స్‌గా రాణిస్తారు. స్త్రీ బలహీనతకు లొంగనంతవరకు వీళ్లు జీవితంలో అజేయులే. నైతిక విలువలు, నీతి నిజాయితీ వీరి పరిశీలనలోకి రావు. స్త్రీలకు అపాయం జరిగితే మాత్రం వీళ్ల సహాయం కొంతవరకు ఉంటుంది. స్త్రీలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటారు.

**శుక్ర గ్రహం అనుకూలంగా లేకపోతే ఇచ్చే ఫలితాలు :-** వీరు బాల్యంలో సౌఖ్యవంతమైన జీవితం గడుపుతారు. నిర్దిష్టమైన క్రీడలోగానీ, కళారంగంలోగానీ విశిష్టమైన స్థానాన్ని, నిపుణతను సాధిస్తారు. పెద్దలు ఆస్తి మొత్తం పోగొట్టడంతో వీరి స్థితి మొత్తం మారిపోతుంది. పూలు అమ్మిన చోట కట్టెలు అమ్మే విధంగా వీళ్ల పరిస్థితి తయారవుతుంది. అయినా వీళ్లు బాధపడరు. పట్టించుకోరు. ఉన్నంతలో సౌఖ్యం అనుభవించడానికి ప్రయత్నిస్తారు. వృత్తి, ఉద్యోగాల్లో ఓ స్థానం సంపాదిస్తారు. వ్యాపారంలో నష్టాలు వస్తాయి. వాటికి కారణం వీరి దుర్వ్యసనాలే. చక్కగా కనిపించడానికి, మంచి వస్త్రధారణకి ప్రాముఖ్యతనిస్తారు. స్త్రీల వల్ల కొన్ని ప్రయోజనాలు చేకూరినా వీళ్లు నిలబెట్టుకోలేరు. శక్తి సామర్థ్యాలు ఉపయోగించరు. విపరీతమైన సోమరితనం ఉంటుంది. తన ఖర్చులకు డబ్బులు వచ్చే వరకు మాత్రమే పని చేస్తారు. ప్రకృతి సౌందర్యాలను కెమెరాలో బంధించడం, ఊహాత్మక చిత్రాలు, రచనలు, నటనానుభవం ఉంటుంది.

వీళ్ల సామర్థ్యానికి గుర్తింపు రాదు. వీళ్ల టాలెంట్ వల్ల మరొకరు లాభపడతారు. ఏ విషయంలోనూ మానసికంగా బాధ ఉండదు. వీరి శక్తి సామర్థ్యాలను చట్ట వ్యతిరేకమైన వాటికి ఉపయోగిస్తారు. నకిలీ సర్టిఫికెట్స్, కరెన్సీ, డూప్లికేట్ నెక్లెస్‌లు, బంగారం ఇందులో కూడా వీరికి సాటి వచ్చే వారు ఉండరు. ఉద్యోగంలో కూడా బాగా పని చేస్తే వీళ్ల ప్రతిభా సామర్థ్యాలు బయటపడతాయి. సీటు వదిలేసి కాలక్షేపం చేస్తారు. ఆడవాళ్లతో ముచ్చట్లు, వెకిలి చేష్టలు, యూనియన్ తగాదాల్లో ఆరంభశూరత్వం, సాయంత్రం కాగానే మద్యం సేవించి వ్యూహాత్మకంగా విషయాలు చర్చించటం వంటి కార్యక్రమాల వల్ల ఇల్లుగుల్ల అవుతుంది. ఎంత సంపాదించినా చాలదు. ఇల్లు గడవదు. చివరికి భార్య కార్యాలయానికి వచ్చి నా భర్త జీతం నాకు ఇవ్వండి అని పై అధికారులకు మొరపెట్టుకునే దాకా వీళ్ల కుటుంబ విషయం గోప్యంగా ఉంటుంది. సంస్థల నుండి రప్పించుకొనటం, అధికారులతో మాట రాకుండా ఇతరుల మీద తప్పు తోసేయటంలో వీళ్లు సిద్ధ హస్తులు. తనకు అడ్డు తగిలితే ఎదుటి వాళ్లని ఇబ్బందులకు గురి చేస్తారు. పని చేయమంటే అది పెద్ద అవమానంగా భావిస్తారు. డబ్బు కాగితం లేనిదే వీళ్ల దగ్గర నుండి ఒక్క కాగితం కూడా కదలదు. అలాగని అతిగా డబ్బు పీడించరు. ఎంతో కొంత ఇస్తే చాలు. లీవు పెట్టకుండా ఆఫీసు ఎగ్గొట్టడం వీళ్లకు చాలా సాధారణ విషయం. సంతానం అదృష్టవంతులు అవుతారు. వీళ్ళ సహకారం లేకుండానే సంతానం మంచి స్థితిని సాధించి, వీళ్లను బాగా చూస్తారు. తల్లికన్నా తండ్రి పట్లే ఎక్కువ ఆదరణ, ప్రేమ ఉంటుంది. సంతానం వీళ్ల జీవితాన్ని పాడు చేసుకున్న తీరుని దురదృష్టం అంటారే తప్ప అపార్థం చేసుకోరు. వాస్తవాలు మాట్లాడరు. మా నాన్న అంత గొప్పవాడు లేనే లేడు అని స్త్రీ సంతానం భావిస్తారు. వీళ్ల ప్రవర్తన ఎలా ఉన్నా భరించి, ప్రేమించే స్నేహ వర్గం కూడా ఉంటారు. ప్రాణ స్నేహిత బృందం ఉంటుంది. అత్యున్నత జీవితం కోట్లాది రూపాయల ఆస్తి పోగొట్టుకున్నా ఆ విషాదం వీళ్లలో మచ్చుకైనా కనిపించదు. బాధల్ని దిగమ్రింగి పైకి అందరినీ నవ్విస్తూ, నవ్వుతూ ఉంటారు.

## శని

**శని గ్రహం అనుకూలంగా ఉంటే ఇచ్చే ఫలితాలు :-** వీరు జీవితంలో కొద్దిపాటి అంశాల మీద దృష్టి కేంద్రీకరిస్తారు. సమాజానికి ఉపయోగపడే గొప్ప విజయాలు సాధిస్తారు. ఉద్యమకారులు సాంకేతిక విద్యా, పరిశోధనల్లోనూ రాణిస్తారు. ఇల్లు, ఆరోగ్యం పట్టకుండా సమాజం, ప్రజలు, ప్రజా సేవ వీటికి పరిశ్రమిస్తారు. ప్రాణం ఇచ్చే అనుచర వర్గాన్ని కలిగి ఉంటారు. ధన సంపాదన పట్ల మక్కువ ఉండదు. అవసరానికి డబ్బులు ఉంటే చాలనే ధోరణి. అవినీతి, అధర్మం, బానిస మనస్తత్వం, ముఖప్రీతి మొదలగునవి వీరి తత్త్వానికి విరుద్ధం. అయినా వాళ్లు అందలం ఎక్కిస్తాం అన్నా వెళ్ళరు. స్వయం కృషితో పైకి రావాలని శ్రమిస్తారు. అహంకారులుగా అపఖ్యాతి వస్తుంది. పోరాడి సంపాదించుకోవడంలో వీరికి ఉన్న సంతృప్తి,

యాచనలోనూ, దానధర్మాలు స్వీకరించడంలోనూ ఉండదు. భార్యాభర్తల మధ్య బంధం కూడా సాదాసీదాగా, స్నేహపూర్వకంగా ఉంటుంది. తండ్రితో సంబంధాలు బెడిసికొడతాయి. కుల, మత, వర్గ విచక్షణ ఉండదు. విశాలమైన భావాలు, ఆధునిక దృక్పథం, సింపుల్ లైఫ్ పట్ల ఇష్టం వీరి లక్షణాలు. ఇతరులు చెప్పే మాటలు వినరు. తనకు ఏది ధర్మం అని తోస్తే అదే చేస్తారు. నైతిక ధర్మానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. జంతువుల పట్ల, పక్షుల పట్ల ఎంతో ప్రేమ కలిగి ఉంటారు. ఐ.ఏ.యస్., ఐ.పి.యస్.వంటి ఉన్నత స్థానాలకు ఎంపిక అవుతారు. ఏ రంగంలో అడుగుపెట్టినా రాజయోగాన్నే చూస్తారు. సినీ, రాజకీయ, వ్యాపార రంగాల్లో అగ్రస్థానం సాధిస్తారు. జాలి హృదయం కలిగి ఉంటారు. స్నేహితులకు, బంధువులకు ఒకరికి తెలియకుండా మరొకరికి సహాయ సహకారాలు అందిస్తారు. క్రమశిక్షణాయుతమైన జీవితం, దైవ భక్తి కలిగి ఉంటారు. స్వామీజీల పట్ల విశ్వాసం ఉండదు. బంధుప్రీతి, జ్ఞాపక శక్తి ఎక్కువ.

**శని గ్రహం అనుకూలంగా లేకపోతే ఇచ్చే ఫలితాలు :-** వీరికి జనాకర్షణ, విచిత్రమైన నేర్పు ఉంటుంది. ప్రపంచజ్ఞానం అనేక విషయాల పట్ల అవగాహన, గొప్ప సలహాలు ఇచ్చే మేధస్సు ఉంటుంది. ఆరోగ్య బలహీన స్థితి, కీళ్ల రోగాలు ఇబ్బంది పెడతాయి. రకరకాలుగా కష్టపడి కుటుంబంలోని వారికి, బంధువులకు, స్నేహితులకు మేలు చేసే తత్వం కలిగి ఉంటారు. వీళ్ళ ప్రతిభా సామర్థ్యాలు చాలా కాలం వెలుగులోకి రావు. ఎన్నో కార్యక్రమాలు కష్టపడి విజయవంతం చేస్తారు. ఆ గౌరవంలో వీరికి భాగం లభించదు. మూతపడ్డ సంస్థలను లాభాల్లో నడిపిస్తారు. స్నేహితులకు కష్టకాలంలో వెన్నంటి ఉండి, రాజకీయ, ఉన్నత పదవులు వచ్చే వరకు కృషి చేస్తారు. అందరూ అందలం ఎక్కితే, మంచి స్థితిలో ఉంటే తన సంగతి వాళ్ళే చూసుకుంటారని వీరి నమ్మకం. వీళ్ళ నమ్మకం నిజం కాదు. సంస్థలు లాభాల్లో నడిచినా, స్నేహితులకు రాజకీయ అధికారం వచ్చినా వీళ్లకు నిరాదరణే ఎదురవుతుంది. నిష్కారణంగా అవతలి వాళ్లు ద్వేషిస్తారు. వీళ్లు స్థలాలు అమ్మితే కలిసి రాదు. వీళ్లు అమ్మిన మరుక్షణం ఆ స్థలం కొనుగోలు చేసిన వారికి 100 రెట్లు రేటు అధికంగా వస్తుంది. చౌక ధరకు స్థిరాస్తులు అమ్ముకుంటారు. వీళ్లంటే ఒక రకమైన భయంతో కూడిన ద్వేషం చాలా మందికి ఉంటుంది. వీళ్ల ప్రవర్తన, మాట్లాడే తీరు ముక్కుసూటిగా, స్పష్టంగా ఉండటమే ఇందుకు కారణం. వీళ్ల ప్రతిభాసామర్థ్యాలు వెలుగులోకి రాకుండా చేయడానికి ఒక వర్గం ఎప్పుడూ కష్టపడుతూ ఉంటుంది. మేలు చేసి విరోధులు అవుతారు. చివరికి తల్లిదండ్రులు కూడా వీళ్ల విషయంలో న్యాయంగా ప్రవర్తించరు. అందరినీ క్షమించే గుణం ఉంటుంది. పట్టుదల, ప్రతీకార గుణం అధికంగానే ఉంటుంది. అందుకోసం ఎంతకాలమైనా వేచి ఉండి శత్రువుల్ని దెబ్బ కొడతారు. ప్రతీకారం, పోరాటం, విరోధం, పనికి ఆటంకాలు, ఇతరుల ఏడుపు, వీళ్లకు సంబంధం లేని సమస్యలతో కాలం వృథా అవుతుంది. రాత్రి వేళ బాగా మెలకువగా ఉంటారు. పగటివేళ

చేయలేని పనులు రాత్రి చేస్తారు. కొద్దిపాటి విశ్రాంతి సరిపెట్టుకుంటారు. ఆస్తినష్టం, ఆత్మీయులు శాశ్వతంగా దూరం కావటం జీవితంలో ఒక శాపంగా మారుతుంది. సమాజం దృష్టిలో లోపాలు ఏవో కొన్ని కనిపిస్తాయి. భగవంతుడి దృష్టిలో తప్పు చేయనంతవరకు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని ధీమాగా ఉంటారు. భార్యాబిడ్డలు వీరి ప్రేమతత్వాన్ని అర్థం చేసుకోలేరు. కుటుంబ విషయాలు వీళ్లు అతిగా పట్టించుకోరు. బాధ్యతలు మరువరు. కోపం తగ్గించుకొని మనస్సులోని బాధలు బయటపడకుండా సవ్యంగా మాట్లాడితే వీళ్లు జీవితంలో గొప్పగా రాణిస్తారు. ఉన్నంతలో ఆకర్షణీయమైన పర్సనాలిటీ కలిగి ఉంటారు. దీర్ఘకాల శత్రుత్వం ఉంటుంది. " శత్రువర్గం పొరపాటు అయిపోయిందని ఒక్క మాట అంటే చాలు" శత్రుత్వం మరచిపోయి మళ్ళీ వాళ్లకే సహాయం చేస్తారు. శత్రువర్గాన్ని త్వరగా క్షమించే వీళ్ల నైజం మిత్రులకు అనుమానం కలిగిస్తుంది. ఇది వీళ్ల వ్యక్తిగత బలహీనత అని ఎదుటివాళ్ళు గమనించలేరు. జీవిత ద్వితీయార్థంలో అఖండమైన పేరు ప్రఖ్యాతలు, శక్తి సామర్థ్యాలకు తగిన గుర్తింపు లభిస్తాయి. ఆర్థికంగా బలపడతారు. వివిధ ప్రాంతాల్లో స్థిరాస్తులు వృద్ధి చేస్తారు. స్థిరాస్తుల విలువ పెరుగుతుంది. జీవితాశయం సాధిస్తారు. వృత్తిపరమైన శత్రువర్గాన్ని అధిగమించి అందరికీ ఆదర్శప్రాయుడిగా నిలుస్తారు.

## రాహుగ్రహం

**రాహు గ్రహం అనుకూలంగా ఉంటే ఇచ్చే ఫలితాలు :-** పెద్దలు ఇచ్చిన ఆస్తి, చదువు చాలా సాధారణంగా ఉంటుంది. చిన్నప్పుడు చాలా తక్కువ స్థాయిలో జీవితం గడుపుతారు. నాస్తికత్వం ఉంటుంది. అమాయకంగా, చురుకు తక్కువగా ఉంటారు. అవకాశాలు, అదృష్టం గొప్పగా కలిసి వస్తాయి. ఉన్నత స్థానాలను అధిరోహిస్తారు. సహాయం చేసే గుణం ఉండదు. అపరిమితమైన ధన కాంక్ష. తాను అనుకున్నది సాధించడానికి అన్ని రకాల వక్రమార్గాలను అనుసరిస్తారు. సాటి వాళ్లను ఏ స్థాయికి కూడా ఎదగనివ్వరు. ధర్మం, న్యాయం, నీతి, నిజాయితీ గురించి వీళ్లు చెప్పే విధంగా చెప్పటం మరెవరి వల్లా కాదు. వీళ్లు అవినీతిపరులు. అబద్ధాల కోరులు, నీతిమాలిన పనులు చేయటంలో సిద్ధహస్తులు. జీవిత మధ్యభాగంలో ఆధ్యాత్మిక చింతన ఏర్పడుతుంది. వీళ్లు మిత భాషులు, ఉపయోగం ఉంటేనే మాట్లాడతారు. వీళ్లు గతం గుర్తులేనట్లుగా జీవితం కొనసాగిస్తారు. కృతజ్ఞత అంటే వీళ్లకి అసలే తెలియదు. క్రమశిక్షణ కలిగి ఉంటారు. పొగాకు వ్యాపారంలో రాణిస్తారు. వీళ్లు మాత్రం పొగత్రాగరు. మద్యపాన వ్యాపారం చేస్తారు. కానీ వీళ్లు మద్యం తాగరు. చదువు పెద్దగా ఉండదు. అయినా విద్యా వ్యాపారంలో వీరిదే అగ్రస్థానం. అసూయాద్వేషాలు, చిన్నపిల్లల మనస్తత్వం ఎంత స్థాయికి ఎదిగినా పోదు. గొప్పు వ్యూహ రచన, సామూహికంగా జనాన్ని మోసం చేయుట, దొంగ ఆర్థిక సంస్థలు, స్కీంలు పెట్టి దివాళా తీయించి జనాన్ని మోసం చేస్తారు. చట్టానికి దొరక్కుండా

అధికారులతో చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతారు. ప్రబలమైన వీరి ఊహాశక్తి ముందు ఎవరూ నిలబడి జయించలేరు. వీరు విఫలమైన రంగంలోనే శాసించే స్థాయికి ఎదుగుతారు. అదృష్టవంతులుగా జీవితంలో మిగిలిపోతారు. పాప భీతి, సెంటిమెంట్సు ఉండవు. నమ్మిన వాళ్లను, నమ్మని వాళ్ళను కూడా నట్టేట ముంచుతారు. జీవిత చరమాంకం బహు నికృష్టంగా ఉంటుంది.

**రాహు గ్రహం అనుకూలంగా లేకపోతే ఇచ్చే ఫలితాలు:** - వంశపారంపర్య ఆస్తులు, స్వార్జితం నష్టపరుస్తారు. తెలివితేటలు, విద్య, సామర్థ్యం అన్నీ ఉండి కూడా రాణించలేరు. ఉన్నతంగా ఉంటుందని భావించిన వీరి జీవితం వాస్తవంలో అలా ఉండదు. అండగా నిలిచిన ముఖ్యులు మరణించుట, లేదా దూరం కావటం, శ్రమ వైఫల్యం, స్థాయికి తగిన వృత్తి ఉద్యోగాలు లభించకపోవటం, వీళ్ళకన్నా తక్కువ వాళ్లు, వీళ్లని దాటి వెళ్ళటం జరుగుతుంది. వ్యాపారాలు చేసి నష్టపోతారు. అష్టకష్టాలు, అవమానాలు అధిగమిస్తారు. దానకర్ణుడులాంటి వాళ్లు సైతం వీళ్ల దగ్గరికి వచ్చే సరికి ఏమీ సహాయం చెయ్యలేరు. వీళ్ల సామర్థ్యం శక్తి శాపంగా మారుతుంది. వ్యసనాలకు బానిస అవుతారు. జూదంలో చాలా పోగొడతారు. దేశవిదేశాలు తిరుగుతారు. అనుభవం సాధిస్తారు. స్త్రీ దేవతల పట్ల భక్తి, శ్రద్ధలు కలిగి ఉంటారు. నిష్కారణంగా జైలు ప్రాప్తి, నిందలు రావటం జరుగుతుంది. ఉన్నత పదవులు తృటిలో తప్పిపోతాయి. ఆరోగ్యం, పట్టుదల మాత్రం మరణించేవరకు ఉంటుంది. నిరాశలోనూ ఆశావాదులు, అనవసరమైన విషయాలపై పరిశోధన చేసి నష్టపోతారు. మంత్రాల గురించి, అతీంద్రియ శక్తుల వశం గురించి, పనికిమాలిన పూజలు, పరిశోధనలు, నిధుల గురించి ఆరాటం, దొంగసాధువుల వల్ల నష్టపోవటం. ఉన్నది పోగొట్టుకోవటం జరుగుతుంది. ఇన్‌స్టాల్‌మెంట్ మీద వస్తువులు పనికొచ్చినా, రాకపోయినా కొనటం వీరి లక్షణం. లాటరీలు, గుఱ్ఱపు పందాల వల్ల నష్టపోవుట, సినిమాల్లో వేషాల కోసం తిరిగి విసిగిపోవటం జరుగుతుంది. "ఏ సమయంలో ఏ పని చేయాలో నిర్ణయించుకోకపోవటమే వీరికి పెద్దలోటు". జడ్జిమెంట్ సరిగ్గా చేయలేరు. వీరి జీవితం ఆటుపోట్లతో కొనసాగుతుంది. శ్రమించి జీవితం గడుపుతారు. సౌఖ్యం ఎరుగని మనుషులుగానే మిగిలిపోతారు. బలమైన వర్గంతో పోరాటం చేసి ఓడిపోతారు. స్నేహానికి వీళ్లే ఆదర్శం అని చెప్పవచ్చు. స్నేహితుల కోసం ఎంతటి త్యాగమైనా చేస్తారు. కుటుంబానికి, ఆత్మీయవర్గానికి దూరం అవుతారు. కొన్ని మార్గదర్శక సూత్రాలు, అమూల్యమైన సేవలు, కొత్త ఒరవడి ఏరంగంలోనైనా ప్రవేశపెడతారు. భాగస్వాములకు దూరంగా ఆధ్యాత్మిక జీవితానికి అంకితం అవుతారు.

## కేతుగ్రహం

**కేతుగ్రహం అనుకూలంగా ఉంటే ఇచ్చే ఫలితాలు :**- వీరి ఊహాశక్తి గొప్పది. అదృష్టం కలిసి రావటం వల్ల భిన్నమైన వ్యాపారాల్లో రాణిస్తారు. ధర్మాత్ములు, దానం చేసే గుణం ఉంటుంది. దానధర్మాలు విరివిగా చేస్తారు. ఎంత ధనికులైనా నిరాడంబరమైన జీవితం గడుపుతారు. నిజమైన సన్యాసులు. ఎన్నో శాస్త్రాల పట్ల, గ్రంథాల పట్ల వీళ్లకు స్పష్టమైన అవగాహన

ఉంటుంది. తనకు దక్కిన ఏ అవకాశాన్నీ దుర్వినియోగం చేయరు. అందరికీ సమన్యాయం చేస్తారు. బాహ్య ప్రపంచ విషయాలను పెద్దగా పట్టించుకోరు. బంధువులను, స్నేహితులను ఆదుకోవటంలో వీరు ముందుంటారు. ఎదుటి వారి కష్టాలను, నష్టాలను వీరు విని ఊరుకోరు. సహాయం చేయడానికి ప్రయత్నిస్తారు. న్యాయమూర్తులుగా రాణిస్తారు. కఠోరమైనటువంటి దీక్షలు చేస్తారు. ఆధ్యాత్మిక చింతన ఎక్కువగా ఉంటుంది. గురుస్థానంలో ఉండి ఎంతో మందిని సంస్కరిస్తారు. గొప్ప ప్రవచకులు. క్రమశిక్షణాయుతమైన జీవితానికి వీరే నిదర్శనం. మంత్ర సిద్ధి కలుగుతుంది. మంచి, చెడులను సమాన దృష్టితోనే చూస్తారు. కుటుంబ సభ్యుల పట్లగానీ, ఇతరుల పట్లగానీ ద్వేషభావం ఉండదు. అలాగని వ్యతిరేక భావం కూడా ఉండదు. మంచి ముఖ వర్చస్సు కలిగి ఉంటారు. జరగబోయే విషయాలను ముందుగానే చెబుతారు. ప్రతిపనిలోనూ నైపుణ్యత కనబడుతుంది. సహజ సిద్ధమైన కొన్ని మంచి లక్షణాలు, నైపుణ్యం ఉంటాయి. ఆధ్యాత్మిక కేంద్రములు, పురావస్తు సేకరణ, పరిశోధన, యోగాభ్యాస కేంద్రాలు అనాధాశ్రమాలు, రక్తదాన శిబిరాలు, సమాజ సేవా కేంద్రాలు మొదలైనవి చక్కగానిర్వహిస్తారు. అవినీతి, ఆశ్రిత పక్షపాతం లేకుండా నిజాయితీగా ప్రవర్తిస్తారు. ఉపాధ్యాయ, అధ్యాపక వృత్తిలో కూడా అంకిత భావంతో పనిచేసి ఎంతో మంది జీవితాలను నిలబెడతారు. తన సుఖానికి, విలాసానికి అసలు ప్రాముఖ్యతనివ్వరు. శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారిని బాగా ఆరాధిస్తారు. వీరి జీవితం మొత్తం పరిశీలిస్తే ఏదో కారణం కోసం, కారకత్వం కోసం జన్మించారని అనిపిస్తుంది. సొంతవాళ్లు మోసం చేసినా భగవంతుడు కరుణిస్తాడు. తనకు అన్యాయం జరిగినా గట్టిగా పోరాడలేరు. కేతువు స్వతంత్రించి వీళ్లకి రాజయోగాన్ని ఇవ్వగలడు. మంత్రులుగా, అధికారులుగా గొప్పగా రాణిస్తారు. వీరి జీవితం పది మందికీ ఆదర్శప్రాయంగా ఉంటుంది. యోగాసనాలు, మార్నింగ్ వాక్, వాటర్ థెరపీ, ఎక్కడెక్కడో విషయాలు, నూతనమైన అంశాలు పరిశోధిస్తారు. ఆచరణలో పెడతారు. ఎదుటివాళ్లని ప్రోత్సహిస్తారు. తగిన సహాయ సహకారాలు అందజేస్తారు. మంచి వాళ్లు మిత్రులుగా లభిస్తారు. చరిత్ర పురుషులుగా రాణిస్తారు. వీళ్ల ఆంతర్యాన్ని పరిశీలిస్తే వీళ్లు కోరుకునేది మోక్ష సామ్రాజ్యం తప్ప మరేమీ కాదని తెలుస్తుంది. మోక్ష సామ్రాజ్యాన్ని అధిరోహించగల సామర్థ్యం వీళ్ల జాతకంలో స్పష్టంగా కనబడుతుంది.

**కేతు గ్రహం అనుకూలంగా లేకపోతే ఇచ్చే ఫలితాలు :-** వీరు ధూమపాన ప్రియులు. వీరి లక్షణములు, జీవితం అంతా భ్రాంతి, అనుమానాల చుట్టూ పరిభ్రమిస్తాయి. ప్రపంచంలో తాను తప్ప మరెవరూ నిజాయితీపరులు కాదన్నట్లు వీరి ప్రవర్తన, మాట తీరు ఉంటాయి. రకరకాల రంగాల్లో ప్రవేశం, ఎందులోనూ పూర్తికాలం ఉండరు. ఉద్యోగం మార్పు. కుదురుగా ఉండరు. మంచి యోగాన్ని స్వల్పకారణంతో చెడగొట్టుకుంటారు. పెద్ద ఉద్యోగం ఎక్కడైనా వస్తే ఆ ఊళ్లో చలి ఎక్కువ, తోటకూర దొరకదు. అందుకే ఉద్యోగం వదులుకున్నాను అన్న సాకులు చెబుతారు. వీళ్లకు మంచి చెప్పిన వాళ్లు విరోధులు అవుతారు. గడ్డం, మీసాలు

అధికంగా పెంచటం, ఒక్కసారిగా మొత్తం తీసేయటం, కొన్ని నెలలపాటు అధికంగా త్రాగటం, ఒక్కసారిగా మానేయటం, రోజూ చైన్ స్మోకింగ్ అది ఒక్కసారిగా మానేయటం, అతీంద్రియ శక్తులు వచ్చాయంటారు. ప్రపంచంలో ప్రతి సంఘటన ముందుగానే తెలుస్తుంది. చూస్తున్నాను అని చెబుతారు. నాలుగు గంటలు తక్కువ కాకుండా రకరకాల కళలు అందరికీ చెప్పి వినిపించటం, ఆ కళలకు అర్థం ఏమిటని ప్రశ్నించటం రోజూ వీరి కార్యక్రమాలు. వీళ్లు చెప్పిన పనిని ఎవరైనా కాదు అంటే వాళ్ళని తిట్టటం, శపించటం చేస్తారు. ఆఫీసులో పనంతా ఒక్కరే చేయటం, సామాజిక సేవలో ఉత్సాహం, రోగులకు సేవలు, చనిపోయిన వారి కుటుంబాలకు అవసరమైన చాకిరీ అంతా చేస్తారు. కుల,మత,వర్గ విచక్షణలు ఉండవు. గంజాయి, కోడిపందాల పట్ల ఆసక్తి, భార్య ప్రవర్తనపై అనుమానం, మధ్యమధ్యలో ఆకస్మిక తనిఖీలు, విచిత్ర వస్త్రధారణ, చక్కగా ఉన్న షర్ట్ మీద ఏవో పిచ్చి డిజైన్‌లు కుట్టించడం, సిగరెట్ లైటర్ మీద పేరు చెక్కటం, జేబు రుమాలు, పెన్సిల్, పెన్ అన్నింటి మీద పేరు లేదా, ఏదో గుర్తు ఉంటుంది. విపరీతమైన దేశభక్తి, ఇండియా క్రికెట్‌లో ఓడిపోయిందన్నా వీరు సహించరు. ఆ మాట అన్నవాళ్ళతో ఏదో గొడవ పెట్టుకుంటారు. ఆకాశంలోకి చూస్తూ నమస్కారం చేయటం, లైటు వెలగగానే చేతిని ముద్దుపెట్టుకోవటం. పక్కవాళ్లకి ఇవి ఏమీ అర్థం కావు. తెలియక ఎవరినైనా అడిగితే గూబ పగల గొడతారు. శకునముల పట్టింపు ఎవరైనా తుమ్మితే బద్ధ శత్రువులా చూస్తారు. ఆడవాళ్లతో తగాదాలు ఎక్కువగా ఉంటాయి. ఆత్మీయులతో మాట్లాడటం, దెయ్యాలు స్నేహితుల్లా సహాయపడటం జరుగుతుందని, తన ఉన్నతికి అదే కారణం అని అందరికీ చెబుతారు. వీళ్ళతో ఎందుకొచ్చిన గోల అని చాలామంది మౌనం వహిస్తారు. వీళ్లు రెచ్చిపోయి, దెయ్యాల, భూతాల కథలు, భేతాళుడితో స్నేహం ఇవన్నీ సీరియల్‌గా చెబుతూనే ఉంటారు. ధన కాంక్ష, మోసం ఉండదు. వాళ్ల భ్రాంతిని అందరూ నమ్మాలి. కానీ వాళ్లు మాత్రం ఎవ్వరినీ నమ్మరు. వాళ్లకు దిష్టి తగిలే అవకాశం లేకపోయినా ప్రతి వారిదీ నరదిష్టి అని వాపోతారు. చేతబడి, బాణామతి ఏవేవో అన్నీ తనకే చేస్తున్నారని ఏదో భావన. భార్యబిడ్డలు ఓర్పు వహించి కుటుంబంను నిలబెడతారు. వీళ్ల పోలికలు పిల్లలకి వచ్చే అవకాశం లేదు. అదే గొప్ప అదృష్టం. వీళ్లు భ్రాంతితో చాలా బాధలు కొని తెచ్చుకుంటారు. నిజమైన సమస్యల్ని పట్టించుకోరు. భార్య సమర్థవంతంగా ఎన్నో అవరోధాల్ని అధిగమించి జీవిత సాఫల్యమునకు ప్రధాన కేంద్రం అవుతుంది. వీళ్ల అమాయకత్వానికి జాలిపడి భగవంతుడు మంచి స్థితి కుటుంబానికి కల్పించాడా? అనే విధంగా కొన్ని సంఘటనలు అనిపిస్తాయి.

**వ్యక్తిగత జాతకం గురించి తెలుసుకోవాలంటే సంప్రదించండి.**

**91-8466932223/4/5 - 91-9014126121**

# నవగ్రహాలు - రుద్రాక్షలు

రుద్రాక్ష ధారణ మంచిది. శుభప్రదం. రుద్రాక్ష ధరించేటప్పుడు కొన్ని ప్రామాణిక సూత్రాలు పాటించాలి. ఏ రుద్రాక్ష ధరిస్తున్నామో ఆ రుద్రాక్షకి సంబంధించిన మంత్రాన్ని అభిమంత్రించి ధరించాలి. ఒక్కొక్క రుద్రాక్షకి ఒక్కొక్క మంత్రం ఉంటుంది. అంతేకాకుండా జాతకాన్ని అనుసరించి రుద్రాక్ష నిర్ణయం చేయాలి. ఏదో ఒక రుద్రాక్ష, ఎవరో చెప్పారని ధరించటం సరికాదు. నిష్ణాతులైనటువంటి జ్యోతిష్కులకు జాతకం చూపించి, వారి సలహా మేరకు రుద్రాక్ష ధరించాలి. స్త్రీలు రుద్రాక్షలు ధరించరాదు. నిష్ణాతులైన జ్యోతిష్కులు ఎవరో మీరే విచారించి తెలుసుకోవాలి. ప్రకటనలు చూసి గొప్ప జ్యోతిష్కులు అని నమ్మి మోసపోవద్దు. ప్రచారం లేకపోయినా గొప్ప జ్యోతిష్కులు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నారు.

**రుద్రాక్ష ధరించడానికి కొన్ని ఉదాహరణలు :-**

1. జాతకంలో కాలసర్పదోషం ఉంటే షణ్ముఖి రుద్రాక్ష ధరించాలి.
2. లగ్న దశమాధిపతుల్లో ఏ ఒక్కరైనా నీచస్థితిలో ఉంటే చతుర్ముఖి రుద్రాక్ష ధరించాలి.
3. చంద్ర లగ్నవశాత్తు ద్వితీయ, ద్వాదశములలో గ్రహములు లేనప్పుడు పంచముఖి రుద్రాక్ష ధరించాలి.
4. భాగ్యాధిపతి నీచస్థితిలో ఉన్నా, పాపగ్రహ దృష్టి కలిగి ఉన్నా ద్విముఖి రుద్రాక్ష ధరించాలి.
6. శష్టాష్టమ వ్యయాధిపతులు ఉచ్ఛ స్థితిలో ఉన్నా, కేంద్ర కోణములలో ఉన్నా అష్టముఖి రుద్రాక్ష ధరించాలి.
7. సప్తమ స్థానాధిపతి (వివాహ స్థానాధిపతి) జాతకంలో బాగా లేనప్పుడు, వైవాహిక సంబంధమైన చిక్కులు ఏర్పడినప్పుడు వివాహం ఆలస్యం అవటం వంటి సమస్యలు ఎదురైనప్పుడు సప్తముఖి, షణ్ముఖి రెండు రుద్రాక్షలు ధరించాలి.
8. నీచ స్థితిలో ఉన్న దశమాధిపతి దశ నడుస్తున్నప్పుడు 18 ముఖాల రుద్రాక్ష ధరించాలి. ఈ విధంగా జాతకాన్ని పరిశీలించి ఎవరికి ఏ రుద్రాక్ష అవసరమో తెలుసుకొని ఆ రుద్రాక్షకి సంబంధించిన మంత్రాన్ని అభిమంత్రించి ఇవ్వాలి. ఇది రుద్రాక్షధారణ విధివిధానం. పైన చెప్పిన విధంగా స్వచ్ఛమైన రుద్రాక్షలను విధి, విధానంగా మీ జాతకం పరిశీలించి **ప్రముఖ జ్యోతిష్కుడు శ్రీ కాళహస్తీశ్వరస్వామి దేవస్థాన ఆస్థాన సిద్ధాంతి పండిట్ ములుగు రామలింగేశ్వర వరప్రసాదు సిద్ధాంతి** ఇవ్వగలరు. ఈ అవకాశాన్ని వినియోగించుకొండి. స్త్రీలు రుద్రాక్షలు ధరించరాదు. వారికి రుద్రాక్షలు ఇవ్వబడవు. మేం రుద్రాక్షలు వ్యాపార దృక్పథంలో అమ్మే ఉద్దేశ్యమే ఉంటే స్త్రీలు రుద్రాక్షల ధరించవచ్చు అని చెప్పేవాళ్లం.

**వ్యక్తిగత జాతకం గురించి తెలుసుకోవాలంటే సంప్రదించండి.**

**91-8466932223/4/5 - 91-9014126121**